డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

- కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి
- యువత సద్వినియోగం చేసుకోవాలని సూచన

కలెక్టరేట్(కాకినాడ), మే5(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ-2025కు హాజరవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా కోచింగ్ అందించనున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తోందన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఆర్థికంగా వెనకబడిన నిరుద్యోగ యువత శిక్షణకు వేలాది రూపాయలు వెచ్చించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని అధిగమించి నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ ద్వారా అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా మెరుగైన శిక్షణతోపాటు డైలీ టెస్ట్ సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 7లోపు గూగుల్ ప్లే స్టోర్‌నుంచి శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆచార్య యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

టెన్త్ టాపర్ నేహాంజనికి ఎస్పీ సత్కారం



నేహాంజనిని అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడక్రైం,మే 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలో 600కు 600 ఉత్తీర్ణత సాధించి టాపర్‌గా నిలిచిన విద్యార్థిని నేహాంజనిని ఎస్పీ బిందు మాధవ్ సత్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కాకినాడ గుదారిగుంటకు చెందిన విద్యార్థిని యాళ్ల నేహాంజనిని, ఆమె తల్లిదండ్రులైన శ్రీనివాసరావు, గంగాభవానిలను ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యల్లో కూడా ఇదే విధంగా ప్రతిభ కనబరిచి ఉన్నతస్థాయికి వెళ్లి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

పవన్‌కల్యాణ్ గెలుపుతో.. మొక్కు తీర్చుకున్న 96ఏళ్ల వృద్ధురాలు

- 11 నెలల పింఛను సొమ్ము రూ.27వేలతో కొత్త ఇసుకపల్లిలో వేగులమ్మతల్లికి గరగ
- పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలో సంబరం
- పవన్‌కల్యాణ్‌తో కలిసి బువ్వ తినాలని ఉందంటున్న పేరంటాలు



మొయ్యి‌లో..

చేతికర్ర సాయంతో గరగ మోసుకొచ్చిన వృద్ధురాలు

వ్యవసాయ పనులు రెండురోజులు వాయిదా వేసుకోవాలి

- రైతులకు వ్యవసాయశాఖ సూచనలు

సామర్లకోట, మే 5(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంవల్ల రాబోయే రెండు, మూడు రోజుల వరకూ అధిక వర్షాల సూచనలు ఉన్నందున జిల్లాలో వ్యవసాయ పనులైన పంట కోతలు, మాసూళ్లు, ఎగర బోతలు, ఆరబెట్టడం వంటి పనులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ రైతులకు సూచించారు. సామర్లకోట మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మండల వ్యవసాయాధికారి ఐ.సత్య ఆయన వెంట పాల్గొన్నారు. అధిక వర్షాల కారణంగా రైతులు తమ పంటను కాపాడుకునేందుకు వ్యవసాయశాఖ మండల వ్యవసాయాధికారులతో అందిస్తున్న సూచనలు, హెచ్చరికలు పాటించాలని డీఏవో సూచించారు.



అన్నదాతకు.. ఆనందమే!

అన్నదాత సుఖీభవ అమలుకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో కసరత్తు
- ఈనెల 20కే అర్హుల జాబితా
- అనర్హుల వడపోత
- కొత్తగా మార్పులుచేర్పులు
- అధికారులకు లాగిన్
- 4.85 లక్షల మందికి లబ్ధి
- రూ.970 కోట్ల నిధులు అవసరం
- కౌలు రైతులకూ వర్తింపు
- 1.80 లక్షల మందికి మేలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెలలోనే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. కుటుంబం యూనిట్‌గా రైతుకు రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో సాయం అందించడానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు పథకం అమలుకు వీలుగా రైతుల వివరాలను సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా అందుకున్న అన్నదాతల జాబితా వడపోతకు సన్నాహాలు ఆరంభించారు. వీరికి ప్రభుత్వం తాజాగా లాగిన్‌లు కేటాయించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులు అర్హులుగా తేలనున్నారు. రూ.970కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

రైతన్నకు ఆర్థిక భరోసాయే..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీడీపీ సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని మేనిఫెస్టోలో ప్రకటించింది. అందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం దగాతో మోసపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించింది. రైతు భరోసా పేరుతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు జగన్ ప్రభుత్వం తూట్లు పొడిచి కేవలం కేంద్ర వాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి చేతులు దులిపేసుకున్న తీరును తప్పుబట్టింది. ఈనేపథ్యంలో రైతులకు అండగా ఉండడానికి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల బడ్జెట్‌లో పథకానికి రూ.6,300 కోట్లు కేటాయించారు. పథకం అమలెప్పుడా అని రైతులు ఎదురుచూస్తోన్న తరుణంలో ఎట్టకేలకు సీఎం చంద్రబాబు రైతులకు తీపికబురు అందించారు. పథకాన్ని ఈ నెలలో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం తాజాగా అన్ని జిల్లాల వ్యవసాయ శాఖలకు గత వైసీపీ హయాంలో రైతు భరోసా పథకం తీసుకున్న అన్నదాతల జాబితాలను పరిశీలనకు పంపించింది. వీటిని మండలస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వడపోత పోయాలని ఆదేశించింది. ఇప్పుడు మండలాలవారీగా అధికారులకు జాబితాలో మార్పులు చేర్పులకు వీలుగా లాగిన్‌లు సైతం కేటాయించింది. ప్రభుత్వం పంపిన జాబితాను రెండు వారాలపాటు అధికారులు మండల స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అనంతరం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల వారీగా పథకం పరిధిలోకి ఎంతమంది రైతులు వస్తారనే దానిపై జాబితా తయారుచేస్తారు. అనర్హులను తొలగిస్తారు. ఆదాయపన్నుదారులు ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాములను గుర్తించి పేర్లను తప్పించనున్నారు. కొత్తగా అర్హులను గుర్తించి జాబితాలో చేర్చనున్నారు. ఈనెల 20 నాటికి అర్హులతో కూడిన జాబితా సిద్ధం చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4.85 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున రూ.970 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

కౌలు రైతులకు పండగే..

ఉమ్మడి జిల్లాలో 4.54 లక్షల మంది వరకు అన్నదాతలు పథకం అమలు కిందకు రానున్నారు.అయితే రాష్ట్రప్రభుత్వం సాధ్యమైనంత ఎక్కువమంది రైతులకు పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది.గత వైసీపీ హయాంలో రకరకాల సాకులతో అర్హులను జగన్ ప్రభుత్వం పక్కనపెట్టేసింది. ఈ నేపథ్యంలో అన్నదాతలను ఇబ్బంది పెట్టకుండా దాదాపు అందరికీ లబ్ధి చేకూర్చాలని సీఎం చంద్రబాబు తాజాగా అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కొత్తగా కౌలు రైతులను పథకం పరిధిలోకి తేవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ జిల్లాలో 65 వేలు, కోనసీమ జిల్లాలో 61 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 54 వేల మంది వరకు అన్నదాతలు పథకం పరిధిలోకి రానున్నారు.ఒకరకంగా కౌలు రైతులకు ఇది వరమే అని చెప్పాలి. ప్రస్తుతం కౌలు రైతు కార్డులు కలిగిన వారినే అధికారులు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇవిలేని వారిని పథకం పరిధిలోకి తీసుకువస్తే జాబితా మరింత పెరగనుంది. మరో పక్క గత ప్రభుత్వం వీరిని అసలు రైతులుగానే పరిగణించలేదు. కానీ కూటమి ప్రభుత్వం వీరిని కూడా అర్హుల జాబితాలోకి చేర్చింది.అటవీ భూములపై హక్కులు (ఆర్‌ఓఎఫ్‌ఆర్) కలిగిన అన్నదాతలకు పథకం ఇస్తున్నట్టు ప్రకటించింది. దీనివల్ల కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు,శంఖవరం, రౌతు లపూడి మండలాల్లో అటవీభూములు సాగు చేస్తోన్న వెయ్యి మంది వరకు అన్నదాతలకు ఆర్థిక లబ్ధి కలగనుంది. గతంలో వీరిని ఏ ప్రభుత్వంకనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.



వర్రీ.. తీరినట్టే!

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

రైతుల సమస్యకు.. మూడు పరిష్కారాలు

- ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెంపు
- జిల్లాలో మరో 2 లక్షల టన్నులు
- తేమశాతం 22 ఉన్నా కొనాలి
- మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ 1:2
- అధికారుల తీరుపై అసహనం
- వాడివేడిగా మంత్రి నాదెండ్ల సమీక్ష

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో సోమవారం సాయంత్రం మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, జేసీలతో సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ని అదనంగా పెంచామని తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు, కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేల టన్నులకు అదనంగా మరో 50 వేల టన్నులు పెంచామన్నారు. గత 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.11,400 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తేమ 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను ఆదేశించారు. కోనసీమలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీని 1:1 ఇవ్వడంపై మంత్రి అటు జేసీ, ఇటు సివిల్ సప్లయిస్ అధికారుల వివరణ కోరారు. ఎమ్మెల్యేల సూచన, మిల్లర్ల కోరిక మేరకు బ్యాంకు గ్యారెంటీ 1:2 ఇవ్వాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలు మళ్లీ జరగకూడదు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన హామీలు కచ్చితంగా అమలు చేయాలన్నారు.

ప్రతి గింజనూ కొంటాం : దుర్గేష్

రాజమహేంద్రవరం: ధాన్యం సేకరణ విషయంలో వైసీపీ అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ధాన్యం అమ్మకాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీంతో మరో 50 వేల టన్నుల సేకరణకు అనుమతి లభించిందని చెప్పారు.

అధికారుల తీరుపై ఆగ్రహం...

ధాన్యం కొనుగోలు విషయమై మంత్రి మనోహర్ వద్ద అనపర్తి, జగ్గంపేట, మండపేట, కొత్తపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు కాకినాడ,తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల అధికారులపై పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కోనసీమ జేసీ ధాన్యం సేకరణపై ఇచ్చిన వివరణలపై మంత్రి మనోహర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ధాన్యం కొనుగోలు అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ అడిగిన ప్రశ్నలకు జేసీ చినరాముడు సరిగా స్పందించకపోవడంతోపాటు ఎమ్మెల్యే నెహ్రూ చెప్పిన విషయాలపైనా ఆయన పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో మంత్రి అసహనం వ్యక్తంచేశారు. ఒక దశలో జేసీని ప్రత్యేకంగా కలవాలని సూచించారు. అటు సివిల్ సప్లయిస్ డీఎంపైనా తనదైనశైలిలో మండిపడ్డారు. పదే పదే తమకు ఎమ్మెల్యేలతో ఫోన్లు చేయించడమేంటని.. క్షేత్రస్థాయిలో తిరగాలని సూచించారు. ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న అంశాలను కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ మంత్రికి వివరించారు. అనంతరం మూడు జిల్లాల జేసీలు ఇప్పటివరకు తమ జిల్లాల్లో రబీ ధాన్యం సేకరణ ప్రగతిని వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యానికి మద్దతు ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. రైతు సేవా కేంద్రాల టార్గెట్ పెంచాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. జిల్లాలో కొనుగోళ్ల పెండింగ్ రూ.16.75 లక్షల కమీషన్ చెల్లింపు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో 40 శాతం ధాన్యం రోడ్డుపైనే ఉందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల జేసీలు చినరాముడు, టి.నిషాంతి, మూడు జిల్లాల రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్న రామకృష్ణ (కాకినాడ), కర్రి వెంకటరెడ్డి (తూర్పు గోదావరి), చౌదరి (కోనసీమ) పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, అధికారులు

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి: డీఆర్వో



అర్జీదారుల గోడు వింటున్న డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ),మే5(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంద్వారా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలనుంచిఅందిన అర్జీలపై సమగ్రమైన సంతృప్తికరమైన పరిష్కారాలను త్వరితగతిన అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలపై మొత్తం 351అర్జీలు అందాయన్నారు. ట్రైనీ కలెక్టర్ మనీషా, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు అర్జీలను స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 66 అర్జీలు

కాకినాడ క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 66మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్‌నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేశారు. అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తిచేసి సమస్య పరిష్కారానికి చర్యలుచేపట్టాలని ఎస్పీఆదేశించారు.

సామర్లకోటలో సివిల్ సప్లయిస్ ఎండీ పర్యటన

- ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల నుంచి ఆరా



సామర్లకోట మండలంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎండీ జిలానీ సమూన్

సామర్లకోట, మే5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సేవాకేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకతో ఉండడంపై సివిల్ సప్లయ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ జిలానీ సమూన్ సోమవారం ఆకస్మిక పర్యటనల ద్వారా క్షేత్రస్థాయి సందర్శనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో రైతుల అవస్థలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు జిల్లా యంత్రాంగంతోపాటు రాష్ట్ర సివిల్ సప్లయ్ అధికారులు స్పందించారు. నేరుగా అమరావతి నుంచి ఎండీ జిలానీ సమూన్ సామర్లకోట మండలానికి చేరుకున్నారు. స్థానిక రెవెన్యూ, సివిల్ సప్లయ్, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి అచ్చంపేట గ్రామంలో రైతుల ఆరబోసిన ధాన్యం రాశుల వద్దకు వెళ్లి వాస్తవ స్థితిపై అధ్యయనం చేశారు. ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైతులనుంచి సమాచారాన్ని సేకరించారు. తేమశాతం, నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాల్లో ప్రభుత్వ సిబ్బంది ద్వారా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. కొనుగోలు సిబ్బందినుంచి పలు ప్రశ్నలకు సమాధానాన్ని రాబట్టారు. ఈ నేపథ్యంలో రైతులు మూకుమ్మడిగా మాట్లాడుతూ తమ ప్రాంతాల్లో అధికశాతం బొండాలు రకం ధాన్యాన్ని సాగు చేశామని సహజంగానే పంట దిగుబడులు అధికంగానే ఉన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా బొండాలరకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంవల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నామని, మారుతున్న వాతావరణ పరిస్థితులతో కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను భద్రపరుచుకోవడం ఆర్థికంగా కష్టతరంగా మారిందని ఏకరువుపెట్టారు. వాస్తవానికి బొండాలరకం ధాన్యం బాయిల్డ్ రైస్‌మిల్లులు మాత్రమే కొనుగోలు చేస్తారని ప్రస్తుతం ఉప్పుడు బియ్యానికి ఎగుమతులు లేవన్న సాకుతో బాయిల్డ్ రైస్ మిల్లులో కూడా కొనుగోలు నిర్వహించడం లేదని ఆరోపించారు. గోనె సంచులు రైతు సేవాకేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులో త్వరితగతిన దిగుమతులు చేయకపోవడంవల్ల రవాణా డెమరేజీచార్జీల పేరిట రైతులకు భారంగా మారిందని వాపోయారు. రైతుల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుంటామని, ఇకనుంచి సమస్యలు లేని రీతిలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహించేలా జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు ఎండీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ జీఎం దేవులునాయక్, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, వ్యవసాయాధికారిణి సత్య పాల్గొన్నారు.

జిల్లాలో 65,338 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

సివిల్ సప్లయ్ జీఎం దేవులునాయక్

సామర్లకోట, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత దాళ్వా సీజన్‌లో సోమవారం సాయంత్రం నాటికి 65,338 మెట్రిక్ టన్నులమేర ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన 277 రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిర్వహించామని సివిల్ సప్లయ్ జీఎం దేవులునాయక్ స్పష్టం చేశారు. సామర్లకోటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకూ ధాన్యాన్ని 7,045మంది రైతులనుంచి కొనుగోలు చేశామన్నారు. వీటి విలువ రూ.150కోట్లు ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో సోమవారం సాయంత్రం నాటికి రూ.132.99కోట్ల మేర సొమ్ములు జమచేశామన్నారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంఏవో ఐ.సత్య, పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్



జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విష్ణువర్ధన్

కలెక్టరేట్(కాకినాడ),మే5(ఆంధ్రజ్యోతి): జిల్లా జేసీ రాహుల్‌మీనాను సోమవారం కాకినాడ రంగరాయ వైద్యకళాశాల(ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లోకి చేరిన ప్రిన్సిపాల్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి దినపత్రిక

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డెస్క్‌లో పనిచేయడానికి

అనుభవం కలిగిన డెస్క్ జర్నలిస్టులు కావాలి

- డిగ్రీ పాసై ఉండాలి. వయస్సు 50 సంవత్సరాలలోపు ఉండాలి.
- తెలుగు భాషపై, వర్తమాన వ్యవహారాలపై మంచి పట్టు ఉండాలి.
- ఇంగ్లీషు అర్థం చేసుకోగలిగి ఉండాలి.
- ఏదైనా ప్రముఖ పత్రిక జిల్లా డెస్క్‌లో కనీసం ఏడేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- క్వార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పేజీ లేఅవుట్ చేయగలిగి ఉండడం అదనపు అర్హత.
- అనుభవం, అర్హతల ప్రాతిపదికన వేతనం ఉంటుంది.

మీ ఫొటో, పూర్తి బయోడేటా, గతానుభవం తాలూకు వివరాలతో హాజరుకండి

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ
09.05.2025

సమయం
ఉదయం 10.30 గంటలకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
9985411 242

చిరునామా:
ప్లాట్ నెం. 208/5ఎ,
దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్, పాలచర్ల(వి),
రాజానగరం మండలం, రాజమహేంద్రవరం-533 102

భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు

- రేపటి నుంచి అన్నవరం సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు
- 8న దివ్యకల్యాణం, 11న రథోత్సవం
- 50వేలమంది విచ్చేస్తారని అంచనా
- ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు



కల్యాణోత్సవ ఏర్పాట్లను ఈవోతో కలిసి పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి

అన్నవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుని వార్షిక కల్యాణ ఘడియలు సమీపిస్తున్న వేళ అన్నవరం దేవస్థానం అధికార యంత్రాంగం భక్తుల సౌకర్యాల కల్పనకు ఇతర శాఖల సహకారంతో చర్యలు చేపడుతున్నట్టు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు ఈ నెల 7న ప్రారంభమై 13తో ముగుస్తాయన్నారు. ప్రధానంగా 8వ తేదీ రాత్రికి జరిగే దివ్యకల్యాణం, 11వతేదీ సాయంత్రం 4గంటలకు నిర్వహించే రథోత్సవం కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారని దీనికనుగుణంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవస్థానం ఇతరశాఖల సమన్వయంతో ఎక్కడా లోటుపాట్లు లేకుండా తగిన ప్రణాళికలతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 8న దివ్యకల్యాణం వీక్షించేందుకు సుమారు 50వేలమంది విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేశామన్నారు. పటిష్టమైన క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం నిరంతరం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. 8న సాయంత్రం 4గంటల నుంచి కొండపైకి భారీ వాహనాలను అనుమతించకుండా కొండదిగువ జూనియర్ కళాశాల మైదానంలో పార్కింగ్ సౌకర్యం కల్పించి అక్కడ నుంచి భక్తులను దేవస్థానం బస్సుల్లో ఉచితంగా కొండపైకి తీసుకెళ్లడం జరుగుతుందని, కల్యాణం అనంతరం 9 ప్రత్యేక కౌంటర్ల ద్వారా ముత్యాల తలంబ్రాల అక్షింతల పంపిణీ చేపడుతున్నామని ఈవో తెలిపారు. ఈ ఏడాది దివ్యకల్యాణోత్సవాలు వారంరోజులు మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు ఫైర్ ఇంజన్లు, వైద్యసదుపాయాల కోసం అంబులెన్సు, కొండపైన వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే దివ్యకల్యాణోత్సవ ఆహ్వానపత్రికలను ప్రముఖులకు అందజేయడం జరిగిందని ఆయన చెప్పారు. భక్తులు దివ్యకల్యాణం తిలకించి సత్యదేవుడి కృపకు పాత్రులుకావాలని ఈవో సుబ్బారావు కోరారు.

సింహాచలం ఘటన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి

అన్నవరంలో ఏర్పాట్ల పరిశీలన

ఇటీవల సింహాచలం దేవస్థానంలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకుని కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నవరంపై ప్రత్యేక దృష్టి సారించారు. సత్యదేవుని వార్షిక కల్యాణం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఆదేశాలతో సోమవారం సాయంత్రం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి కల్యాణోత్సవ ప్రాంగణాన్ని పరిశీలించారు. కల్యాణం వీక్షించేందుకు భక్తుల సిట్టింగ్ సామర్థ్యం, బారీకేడ్ల ఏర్పాటు, క్యూలైన్ వ్యవస్థ, విద్యుత్‌లైన్ వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు ఉన్నారు.

పెద్ద రథానికి ట్రయల్‌రన్

సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాల్లో ఈనెల 11న జరిగే రథోత్సవానికి వినియోగించే పెద్ద రథానికి సోమవారం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సమక్షంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. సుమారు 35 అడుగుల పొడవుల గల ఈ రథంతో కార్యక్రమం నిర్వహించడం అధికారులకు కత్తి మీద సాములా మారింది. గతేడాది ఈ రథోత్సవం ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు గ్రామంలో మెయిన్‌రోడ్డు మీదుగా జరగనుండడంతో గతేడాది గ్రామంలో విద్యుత్‌సరఫరా నిలుపుదలచేశారు. దీంతో గ్రామస్థులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఆ ఇబ్బందులు లేకుండా సెంటర్ లైటింగ్‌ను జనరేటర్ సాయంతో వెలిగించి కేవలం మెయిన్‌రోడ్డుపై విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి గ్రామంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరిగేలా దేవస్థానం విద్యుత్‌విభాగం, ఏపీఈపీడీసీఎల్ అధికారులు సంయుక్తంగా ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ట్రయల్‌రన్ విజయవంతమైనట్టు అధికారులు తెలిపారు.



ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న అధికారులు

సింహాచలం ఘటనలో మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

రూ.25 లక్షల వంతున చెక్కులు అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



కుంపట్ల శేషారావు తండ్రి శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అంబాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో గోడ కూలిన ఘటనలో జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారని, బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సింహాచలం చందనోత్సవ కార్యక్రమానికి వెళ్లి గత నెల 30న గోడ కూలిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. అంబాజీపేట గ్రామం కొర్లపాటివారిపాలెనికి చెందిన పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల ఈశ్వరమణికంఠశేషారావులు గోడకూలి మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కొర్లపాటివారిపాలెంలో స్వామినాయుడు తండ్రి పత్తి వీరవెంకట సత్యనారాయణ, శేషారావు తండ్రి శ్రీనివాసరావుకు చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు అందించారు. స్వామినాయుడు, మణికంఠ చిత్రపటాల వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, ఇన్‌చార్జ్ తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, సుంకర బాలాజీ, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి వెంకటేశ్వరరావు, బాబి తదితరులు ఉన్నారు.

పుట్టినరోజు వేడుకకు పయనమై..

ఆటో బోల్తా పడి ఒకరు మృతి, నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

గొల్లప్రోలు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళ మృతిచెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఆర్లంక రామలక్ష్మి, రౌతు సత్యవతి, అప్పలనరస, లక్ష్మి అదే గ్రామానికి చెందిన గోవిందు ఆటోలో కొత్తపల్లి మండలం గోర్సలో జరిగే బంధువుల కుమార్తె పుట్టినరోజు వేడుకలో పాల్గొనేందుకు బయల్దేరారు. తాటిపర్తి జంక్షన్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో సమీపంలోని పొలాల్లోకి బోల్తా పడి పల్టీలు కొట్టింది. ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యారు. తొలుత వారిని పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామలక్ష్మి (50) మరణించింది. రామలక్ష్మి భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముగండిలో అంతు చిక్కని వ్యాధి

గుర్తించలేకపోతున్న అధికారులు

బాధపడుతున్న గిరిజనులు



అంతుచిక్కని వ్యాధితో మంచం పట్టిన పదేళ్ల చిన్నారి కోసు వర్షిణి

దేవీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరానికి 17 కిలోమీటర్ల దూరంలో దేవీపట్నం మండలం పాముగండి గ్రామంలో గిరిజనులు 20 రోజులుగా అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నారు. సుమారు 40మంది జ్వరాలతో అల్లాడిపోతూ పాదాల నుంచి మోకాళ్ల వరకు కాళ్ల వాపుతో మంచానపడ్డారు. వ్యాధి తగ్గకపోవడంతో గిరిజనులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే వైద్యాధికారులు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించినా వ్యాధిని గుర్తించలేకపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందించాలని సర్పంచ్ శివారెడ్డి కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్ స్తంభంపై రవికృష్ణ మృతదేహం



ఫైల్‌ఫొటో

అంతర్వేది, మే 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూల గ్రామంలో అకాల వర్షాలకు తెగిపోయిన విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో గొర్ల రవికృష్ణ (35) మృతి చెందాడు. ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రవికృష్ణ గ్రామంలో స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచానామా నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రవికృష్ణకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. టీడీపీ కార్యకర్తగా ఉన్న రవికృష్ణకు క్రియాశీలక సభ్యత్వం ఉందని మండలాధ్యక్షుడు ఎమ్.నాని తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

గొల్లప్రోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారులోని చౌడ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్టు వీఆర్వో కె.మంగతాయారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, ఎటువంటి వివరాలు అందుబాటులో లేవని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 17 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1,2 సీఐలు ఎన్. రమేష్, డి.రామారావు సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17 మంది పట్టుబడారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 8 మందికి 2 రోజులు చొప్పున జైలు శిక్ష, మరో 9మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ చెప్పారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

» రైతులకు అన్యాయం జరగదు » మంత్రి నాదెండ్ల మనోహర్ » కాకినాడ జిల్లాలో తడిచిన ధాన్యం రాశుల పరిశీలన



జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట రూరల్/కాకినాడ రూరల్/ పెద్దాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సుడిగాలి పర్యటన చేశారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి పర్యటించి అకాల వర్షాలతో తడిచిపోయిన ధాన్యం రాశులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలతో తడిచిపోయిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు మంత్రికి విన్నవించుకున్నారు. నాదెండ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని హామీఇచ్చారు. తడిచిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దన్నారు. ఇక్కడి సమస్యను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పర్యటనకు వచ్చానన్నారు. జిల్లాలో 95వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసే విధంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. అవసరమైతే మరో 50వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు కూడా ఆలోచిస్తున్నామన్నారు. జగ్గంపేట మండలంలో 250 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి దృష్టికి నెహ్రూ తీసుకెళ్లగా అవసరమైతే 350 మెట్రిక్ టన్నులు అవసరమైన కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, నమ్మవద్దని వారి కుట్రలను తిప్పి కొట్టాలని రైతులను కోరారు. ఆయన వెంట జేసీ రాహుల్‌మీనా, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, సివిల్ సప్లై డీఎం దేవలనాయక్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, కుడా చైర్మన్ తుమ్మలబాబు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ ఉన్నారు.

కాకినాడ రూరల్ మండలం చీడిగ హైవే రోడ్డుపై తడిసిపోయిన ధాన్యాన్ని మంత్రి మనోహర్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి పరిశీలించారు. రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిబంధనలు పాటించని రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్డీవో మల్లిబాబును ఆదేశించారు. పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో తడిసిన ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖను సమాయత్తంచేసినట్టు చెప్పారు.



కాకినాడ రూరల్ మండలం చీడిగలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి

పేదల వైద్యానికి సహకారం అమోఘం

కలెక్టర్ షాన్‌మోహన్

'కెఎస్‌పీఎల్' రూ.55 లక్షలతో జీజీహెచ్‌కు మౌలిక సదుపాయాలు



ఐసీయూలో పడకలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

జీజీహెచ్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ (కెఎస్‌పీఎల్) అందించిన సహాయ, సహకారాలు అమోఘమైనవని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ కొనియాడారు. జీజీహెచ్ ట్రామా కేర్ విభాగంలో సోమవారం కెఎస్‌పీఎల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సీఎస్ఆర్)లో భాగంగా రూ.55 లక్షలతో సమకూర్చిన 3 వెంటిలేటర్‌లు, 8 మల్టీపారా మానిటర్‌లు, 8 ఐసీయూ పడకలు, 8 గైనకాలజీ పరిశీలన బెంచీలను సంస్థ ఎండీ కెవిరావు, కలెక్టర్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకుడు మ రెడ్డి శ్రీనివాస్ సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. పాండురంగ విఠల్‌కు అప్ప గించారు. అనంతరం సర్జరీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్‌కు రూ.55 లక్షలతో మౌలిక సదుపాయాలను సమకూర్చడం అభినందనీయమని కేఎస్‌పీఎల్ ఎండీ కేవీ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ ఉదయ్ మాట్లాడుతూ నాలుగైదు జిల్లాల నుంచి నిత్యం రోగులు, క్షతగాత్రులు, గర్భిణులు వేల సంఖ్యలో జీజీహెచ్‌కు వస్తుంటారన్నారు. గతేడాది 8 లక్షలమంది అవుట్ పేషెంట్లు, 17 వేలమంది ఇన్‌పేషెంట్లు జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందగా, సుమారు 45 వేల సర్జరీలు జరగడం గర్వకారణమన్నారు. జీజీహెచ్ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులుగా తాము, అధికారులు చిత్తశుద్ధితో కృషి చేశామన్నారు. జీజీహెచ్ భవిష్యత్తుతరాలకు వైద్య సేవలనం దించే నిష్ణాతులైన వైద్య నిపుణులను అందిస్తుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో త్వరలో జీజీహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలందించడంలో జీజీహెచ్ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. గతంలో కెఎస్‌పిఎల్ జీజీహెచ్‌కు చాలా సార్లు సహకారాన్ని అందించదని గుర్తుచేశారు. ఎంసీ హెచ్ విభాగ నిర్మాణ పనులు పూర్తయితే 500 పడకలు నూతనంగా అందుబాటులోకి వస్తాయని తద్వారా ఆసుపత్రిపై భారం తగ్గి మరింత నాణ్యమైన వైద్య సేవలందించేందుకు దోహదపడుతుందన్నారు. కెఎస్‌పిఎల్ ఎండి కెవి రావును ప్రత్యేకంగా సత్కరించారు. కెఎస్‌పిఎల్ సీఈవో మురళీధర్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి, అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న, ఆర్థోప్రొఫెసర్ డాక్టర్ ముఖర్జీ ఉన్నారు.

'ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై రైతులకు అవగాహన అవసరం'



వ్యవసాయ సేద్య విధానాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొవ్వూరు, మే 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో జిల్లా ఏరువాక కేంద్రం, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతుసదస్సు నిర్వహించారు. భరతలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, నూతన వంగడాలు, లాభదాయకమైన సేద్యం, మార్కెటింగ్, వివిధ పంటల దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు గత 4 నెలలుగా గ్రామాల్లో నైరా కళాశాల విద్యార్థుల కార్యకలాపాలను వివరించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అనువైన, అధిక దిగుబడులను ఇచ్చే సార్వా, దాళ్వా రకాలను సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.సీహెచ్‌వీ.నరసింహరావు, మానుకొండ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, ఎంపీటీసీ రోహిణి కోమలి, వ్యవసాయశాఖ కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్, శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుమల రెడ్డి, ఇంజనీరు అప్పారావు, అభ్యుదయ రైతులు, నైరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 4 బంగారు పతకాలు

సత్తా చాటిన కాకినాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు సాధించారు. జూన్‌లో బెంగళూరులో 40 దేశాలతో జరిగే ఏషియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన శ్రీనివాసరావును పలువురు అభినందించారు.



బంగారు పతకాలు అందుకుంటున్న డ్రైవర్ శ్రీనివాసరావు

సంఘ సేవ, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యం

జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, ముగిసిన యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్ర స్థాయి శిబిరం



రెడ్‌క్రాస్ వలంటీర్లతో జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు

కాకినాడ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారతీయులు సంఘ సేవ, సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తారని కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే.ప్రసాద్ అన్నారు. కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ, కాకినాడ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి శిబిరం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించినట్టు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఈ వేడుకలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ, సమాజసేవలో రెడ్‌క్రాస్ వలంటీర్లు ముందుండడం హర్షించదగ్గ విషయమన్నారు. వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కాకినాడ శాఖ చైర్‌పర్సన్ ఎన్.సుగుణారెడ్డి, కార్యదర్శి కె.శివకుమార్, ప్రిన్సిపాల్ కరుణ, శివరామకృష్ణతేజేశ్వరరావు, దుర్గాదేవి, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, చిరంజీవి, నాగరాజు ఉన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి రథోత్సవం

గోదావరి నదిలో స్వామివారికి త్రిశూల స్నానం

ఐ.పోలవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆఖరి రోజున గవ్యాంతం, కళాన్యాసం, వసంతోత్సవం వంటి పూజలు జరిగాయి. 70మంది వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మేళతాళాలతో ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను మురమళ్ల పుష్కరాల రేవుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం వృద్ధగౌతమిలో స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులైన శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పుష్పోత్సవం, పవళింపుసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ రాజేష్ గురుకుల్ శిష్యబృందం ఐదురోజుల పాటు చేసిన అలంకరణలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు ముగింపు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని వీరేశ్వరుని పూజలు చేశారు.



మురమళ్లలో శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యాలు



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రవాణారంగ సమస్యలపై నేడు

రౌండ్‌టేబుల్ సమావేశం

కాకినాడ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): రవాణారంగ సమస్యలపై మంగళవారం ఉదయం పది గంటలకు కచేరీపేటలోని సుందరయ్య భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో-కన్వీనర్ పలివెల వీరబాబు తెలిపారు. ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ట్రాన్స్‌పోర్ట్ సంఘాలు కూడా భాగస్వాములు అవుతున్నాయన్నారు.



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న కల్యాణిప్రసాద్ దంపతులు. చిత్రంలో పూర్వ విద్యార్థులు

రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల దాతృత్వం

కార్పొరేషన్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ 1978 బ్యాచ్ చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్‌కి చెందిన గుముడిలి కుటుంబీకుల ఆర్థిక సాయంతో కాకినాడ ఆర్టీసీ డిపోకి రూ.1.10 లక్షలు విలువైన వాటర్ కూలర్ బహూకరించినట్టు మేనేజరు మనోహర్ చెప్పారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ బాదం బాలకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో కూలర్‌ని ట్రస్ట్ సెక్రటరీ నేమాని కల్యాణి-ప్రసాద్ దంపతులు ప్రారంభించారు. ట్రెజరర్ జగన్నాథరావు, శీమకుర్తి పాపారావు, అసిస్టెంట్ మేనేజరు బాలకృష్ణ, స్టేషన్ మేనేజరు వి.ధర్మరావు, ఎస్.స్వామి, వీఆర్వో సీహెచ్ వెంకట్రాజు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నూర్ బాషా సంఘం, మస్జిదే ఫరాన్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

నూర్‌బాషా సంఘం కార్యవర్గ ఎన్నిక

కాకినాడ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నూర్ బాషా సంఘం, మస్జిదే అల్ ఫరాన్ కమిటీల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రేచర్లపేటలోని మసీదు హాలులో సోమవారం జరిగిన ఎన్నికకు మేవా కమిటీ అధ్యక్షుడు, ముస్లిం జేఏసీ కో-కన్వీనర్ జవహర్ అలీ ఆధ్వర్యం వహించారు. అధ్యక్షుడిగా నయీం సిద్దిక్, ప్రధాన కార్యదర్శిగా జాఫర్ అలీ, కోశాధికారిగా అహ్మద్, గౌరవాధ్యక్షుడిగా ఎండీ జమీల్ అస్గర్ ఎన్నికయ్యారు. నాలుగో సారి గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జమీల్‌ను సభ్యులు అభినందించారు. మొత్తం 17 మందితో నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. ముస్లిం పెద్దలు, కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ బీచ్‌లో చెత్తాచెదారాలను తొలగించిన ఎమ్మెల్యే నానాజీ, కూటమి పార్టీల నాయకులు

'తీర ప్రాంత సంరక్షణ మనందరి బాధ్యత'

సర్పవరం జంక్షన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించే తీర ప్రాంత సంరక్షణ మనందరి బాధ్యత అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ఎన్టీఆర్ బీచ్‌లో రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించామని, పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా చెత్తాచెదారాన్ని శుభ్రం చేసినట్టు చెప్పారు. తీరంలో సేకరించిన సుమారు మూడు టన్నుల చెత్త, వ్యర్థాలను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకి తరలించారు. ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, రంబాల వెంకటేశ్వరరావు, టీడీపీ కాకినాడ రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), నులుకుర్తి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందు, తాటికాయల వీరబాబు, సోదె ముసలయ్య, పాండ్రంకి రాజు, శెట్టి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక సేవతో గుర్తింపు'

కరప, మే 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం రాము, అరుణ ఇండస్ట్రీస్ ఎండీ చింతా సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వేళంగిలో ట్రస్ట్ ఆఫ్ బొండా 19వ అర్ధ సంవత్సర సమావేశంలో భాగంగా వ్యవస్థాపకుడు డాక్టర్ బొండా వెంకన్నరావు 500 మందికి దుస్తులు, స్కూల్‌కు వెళ్లే బాలికకు బేబీ సైకిల్, సమాజ సేవ చేస్తున్న పలువురికి నగదు బహుమతులు అందజేశారు. లబ్ధిదారులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆఫ్ బొండా డైరెక్టర్లు బొండా వీర వెంకట సత్యనారాయణమూర్తి, లక్ష్మీకుమారి, డాక్టర్ బొండా సూర్యారావు-అనితారాణి, డాక్టర్ బొండా రాజ్‌కుమార్-హరిణి దంపతులు, ఎంఈవో వీవీ శివప్రసాద్, ఎన్‌సీసీ ఆఫీసర్ వీవీ రమణమూర్తి, డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, డాల్ఫిన్ హోటల్స్ అధినేత బదిరెడ్డి వెంకన్న, వేళంగి లయన్స్ క్లబ్ సభ్యులు బొడ్డు భాస్కర రామన్, చుండ్రు వెంకన్నరావు, చుండ్రు శ్రీధర్, మెర్ల రాజేంద్రన్, ఇళ్ల ఆదేష్, జెమ్మీ, గరగ రామయ్య, శాకా శ్రీనివాస్, సుంకర చంటి, కుంచే అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



బాలికకు సైకిల్ అందజేస్తున్న డాక్టర్ వెంకన్నరావు

విద్యార్థులను ఆకట్టుకున్న మ్యాజిక్ షో

కాకినాడ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం ఉపాధ్యాయుడు వీఎస్వీ రమణమూర్తి ప్రదర్శించిన మ్యాజిక్ మేథమెటిక్స్, మ్యాజిక్ షో ఆకట్టుకుంది. ఆయన విద్యార్థులతో పలు రకాల మ్యాజిక్ టెక్నిక్స్ చేయించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు బి.సూర్యనారాయణ విద్యార్థులతో ఓరిగామి పేపర్ క్రాఫ్ట్ వర్క్ చేయించారు. ఇంగ్లిషు గ్రామర్, సాఫ్ట్ స్కిల్స్‌పై ఎం.సత్యబాల, డీఆర్డీఏ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్, సిబ్బంది ఎస్.రాజు, టి.వీర్రాజు, ఏవీఎస్ నాగేంద్రకుమార్, వి.అరుణ, కె.ప్రియదర్శిని, వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



మ్యాజిక్ ప్రదర్శన ఇస్తున్న రమణమూర్తి

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

పెద్దాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో పుస్తక పఠనం చాలా అవసరమని, అది జ్ఞాన సముపార్జనకు దోహదపడుతుందని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం పుస్తక పఠనం, ఆంగ్ల భాషపై పట్టు, నామవాచకం విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, ఉపాధ్యాయుడు గుణ్ణం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి నాగరాజు

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలకు

రూ.4 కోట్లు

నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు

పిఠాపురం/గొల్లప్రోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల అభివృద్ధికి రూ.4కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వివిధ పథకాల ద్వారా నిధుల మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. సిబ్బంది జీతభత్యాలు, వీధిలైట్లు, తాగునీటి నిర్వహణ తదితర ఖర్చులకే పిఠాపురం పురపాలక సంఘం, గొల్లప్రోలు నగర పంచాయతీ సాధారణ నిధులు పూర్తిగా ఖర్చవుతున్న నేపథ్యంలోరెండు పట్టణాల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు నిధుల కొరత ప్రధాన సమస్యగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రెండు పట్టణాలకు నిధులు కేటాయించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. దీంతో ఆయన నిధులు విడుదల చేసేందుకు అంగీకరించారు. ఇదే విషయాన్ని గత నెల 25న పిఠాపురం వచ్చిన పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం పట్టణానికి రూ.3కోట్లు, గొల్లప్రోలుకు రూ.కోటి మంజూరు చేస్తూ పుర, పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ వద్ద అందుబాటులో ఉన్న బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 2020 నిధుల నుంచి వీటిని కేటాయించారు. ఈ నిధులను తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి, వీధిలైట్ల నిర్వహణ, పార్కుల అభివృద్ధికి వినియోగించాలని ఉత్తర్వుల్లో సూచించారు. నిధులు మంజూరు కావడంతో చేపట్టాల్సిన పనుల అంచనాలను తయారు చేసిన ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

డిమాండ్ల సాధనకు ఉద్యమించిన ఆర్టీసీ ఉద్యోగులు

కాకినాడ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ-ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఐదో దఫా ఉద్యమంలో భాగంగా ఆర్టీసీ కాకినాడ డిపో ఉద్యోగులు సోమవారం కాకినాడ ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ 58 డిమాండ్లలో భాగంగా ఉద్యోగ భద్రతకు 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ ఇప్పించాలని, సిబ్బంది కొరత తీర్చాలని, లీవ్ పొజిషన్ మెరుగుపరచాలని, కొత్త ఉద్యోగాలు కల్పించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, గ్యారేజీల మెకానిక్‌లపై పని భారం తగ్గించాలని నినాదాలు చేశారు. వీటితో పాటు మెమోరాండంలో చేర్చిన అనేక సమస్యలను పరిష్కరించాలని 73 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. వినతులు స్వీకరించిన ఆర్డీవో ఎస్.మల్లిబాబు, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర స్పందిస్తూ ఈ మెమోరాండాలను తక్షణం ప్రభుత్వానికి పంపుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పద్మ, రీజనల్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, రీజనల్ కార్యదర్శి ఏవీ రావు, డిపో సెక్రటరీ చక్రం, డిపో ప్రెసిడెంట్ గోవింద్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ డిపో కార్యదర్శి పీఎల్ రాజు, ఎన్ఎంయూ కమిటీ సభ్యులు, డిపో గ్యారేజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

'పీజీఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి'

పిఠాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 64 వినతులు, ఫిర్యాదులను ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి స్వీకరించారు. అర్జీలను పరిశీలించి వాటిని ఆయా శాఖాధికారులకు పంపుతూ తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏపీడీ వసంతమాధవి, తహసీల్దార్లు గోపాలకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోకు అనుగుణంగా మద్యం షాపులు తెరిచి ఉంచే సమయాలను నియంత్రించాలని మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ కోరారు. పీజీఆర్ఎస్‌లో ఐదుసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదన్నారు. పట్టణంలోని 2వ వార్డులో మునిసిపాలిటీ స్థలంలో ఆలయం గోడ నిర్మిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సోమరౌతు లలితాదేవి ఫిర్యాదు చేశారు. 18వ వార్డు దాసరి వారి వీధిలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ పంపనబోయిన అన్నపూర్ణ కోరారు.



పాడా కార్యాలయంలో వినతి స్వీకరిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి



వర్మకు ఫిర్యాదు చేస్తున్న శ్రామికులు

'ఉపాధి పనులు కల్పించట్లేదు'

పిఠాపురం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా తమకు పనులు కల్పించట్లేదని పిఠాపురం మండలం భోగాపురం గ్రామానికి చెందిన దళితులు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు ఫిర్యాదు చేశారు. దీనికి వర్మ స్పందిస్తూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కోరిన వారందరికీ పని కల్పిస్తామని స్పష్టం చేశారు. తాను అధికారులతో మాట్లాడతానని మంగళవారం నుంచి పనుల్లోకి వెళ్లాలని సూచించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాల సరుకుల లారీని ప్రారంభిస్తున్న దృశ్యం

నిత్యాన్నదానానికి నిత్యావసరాల సేకరణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): బద్రీనాథ్‌లో ఈ నెల 15న ప్రారంభం కానున్న సరస్వతి నదీ పుష్కరాల్లో అన్నదానానికి దాతల సహకారంతో నిత్యావసరాలు సేకరించారు. సంబంధిత లారీకి శ్రీకంఠ బలాజీ, ధనసాగర్ ప్రసాద్, పాడిశెట్టి సుబ్రహ్మణ్యం పూజ చేయగా కరప విశ్రాంత తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ శిష్టల, నేతి నాగేశ్వరరావు, సోడిశెట్టి పద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

వేట నిషేధ పరిహారం పెంపుపై హర్షం

సర్పవరం జంక్షన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే జీవన భృతిని రూ.20వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని టీడీపీ రూరల్ నియోజకవర్గ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) తెలిపారు. సోమవారం కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో చంద్రబాబు చిత్రపటానికి మత్స్యకారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాశ్‌గౌడ్, కాకరపల్లి చలపతిరావు, రాందేవు సీతయ్యదొర, జి.శ్రీనివాస్, మత్స్యకార నాయకులు గరికిన సింహాద్రి, యజ్జల శ్రీను, ఎం.రమణ, మైలపల్లి జనార్దన్, చోడిశెట్టి కృష్ణ, దూడా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు, టీడీపీ నేత ప్రభాకర్

కళ్లకు గంతలు కట్టుకుని సీహెచ్‌వోల నిరసన

కలెక్టరేట్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో (విలేజ్ హెల్త్ క్లీనిక్)లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం కూడా నిరవధిక సమ్మె కొనసాగించారు. సీహెచ్‌వోలు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ కమిటీ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లు సమ్మెకు మద్దతు పలికారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల తరహాలో 23శాతం వేతనాలు పెంచాలన్నారు. భవనాల అద్దె బకాయిలు చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హేమంత్‌కుమార్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

పిఠాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామా థియేటర్ సెంటర్లో పిఠాపురం మండల న్యాయ సేవా అధికార సంఘం ఆధ్వర్యంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మిక చట్టాలు, బీమా, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్యానల్ అడ్వకేట్ సత్యవేణి, పారా లీగల్ వలంటీర్ టి.కామేశ్వరరావు, సీఐటీయూ నాయకులు కరణం విశ్వనాథం, దుర్గ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు

అంతరాయం

గొల్లప్రోలు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్‌లో భాగంగా గొల్లప్రోలు మండలం మల్లవరం, తొండంగి మండలం ఏవీ నగరం గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరా నిమిత్తం కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఈ కారణంగా చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లోని వ్యవసాయ సర్వీసులు, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, తొండంగి మండలంలోని ఏవీ నగరం గ్రామాల్లోని సాధారణ, వ్యవసాయ సర్వీసులకు ఈ నెల 6,7 తేదీల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

12న 'మాలల మహా రణభేరి'

పిఠాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కాకినాడలోని మెక్లారిన్ స్కూలు ఆవరణలో ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు జరిగే మాలల మహా రణభేరి సభను విజయవంతం చేయాలని మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్ కోరారు. సంబంధిత పోస్టర్‌ను సోమవారం అయితేనగర్‌లో ఆవిష్కరించారు. కౌన్సిలర్ పెదపాటి రాజేష్, మాజీ కౌన్సిలర్ దుర్గాడ విజయలక్ష్మి, పులపూరి చంటి, జైభీమ్ సంఘం అధ్యక్షుడు చీకోటి ఏసుబాబు, కొంగు బాబీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మణికంఠను సత్కరిస్తున్న గ్రాంటు గ్రామస్తులు

బాక్సర్‌కు సత్కారం

తాళ్లరేవు, మే 5 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామానికి చెందిన జాతీయ స్థాయి బాక్సర్ పిల్లి మణికంఠ ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అండర్-19 బాక్సింగ్ పోటీల్లో ఏపీ తరపున పాల్గొని విజేతగా నిలిచాడు. సోమవారం అతడికి గ్రామస్తులు చిరు సన్మానం చేశారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, ధూళిపూడి వెంకటరమణ, కె.శివన్నారాయణ, కె.రవీంద్ర, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



ధాన్యం రాశిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ గీత

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

పిఠాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ డిమాండ్ చేశారు. పిఠాపురం, పరిసర ప్రాంతాల్లో వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను ఆమె సోమవారం పరిశీలించారు. నియోజకవర్గంలో 530 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, మామిడి, అరటి పంటలకు నష్టం జరిగిందని చెప్పారు. ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

పొలం ఆక్రమణపై ఫిర్యాదు

కలెక్టరేట్ (కాకినాడ), మే 5 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం రామేశ్వరంలో రెండో పంత శ్మశానం వద్ద తనకు 60 సెంట్ల పొలం ఉందని రైతు వంకా భాస్కరరావు తెలిపాడు. దానిని గ్రామస్తుడు దుర్గ ఆక్రమించుకుని పాక వేశాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో అధికారులకు సోమవారం వినతిపత్రం ఇచ్చాడు.



కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

'ధాన్యం రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'

పిఠాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రంగు మారకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి సూచించారు. పిఠాపురం పట్టణం, మండలంలోని గ్రామాల్లో వర్షం కారణంగా కల్లాలు, పొలాల్లో తడిచిన ధాన్యం రాశులను ఆమె సోమవారం పరిశీలించారు. 480 టన్నుల ధాన్యం పాక్షికంగా తడిసినట్టు గుర్తించామన్నారు. వర్షపు నీరుచేరి ధాన్యం రాశుల్లో కింద మూడు అడుగుల వరకు తడిసిందని చెప్పారు. తడిసిన, తడవని ధాన్యాలను వేర్వేరుగా ఆరబెట్టుకోవాలని సూచించారు. ధాన్యం రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణం కలిపి ఆరబెట్టాలన్నారు. ఆమె వెంట వ్యవసాయాధికారి అచ్యుతరావు, వీఏఏలు ఉన్నారు.

'ఉద్యాన పంటల సాగు పెంచాలి'

పెద్దాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): సాగులో లేని భూములను గుర్తించి ఉద్యాన పంటల సాగుకు వినియోగించేలా గ్రామ సమన్వయ కమిటీలు కృషి చేయాలని ఎంపీడీవో డి.శ్రీలలిత కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యాన శాఖాధికారి నూనె సుజాత అధ్యక్షతన సోమవారం జరిగిన మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ప్రభుత్వం గుర్తించిన 350 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు చేపట్టడానికి అమలులో ఉన్న పథకాల వివరాలను తెలియజేశారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీల కార్యదర్శులు గ్రామ సమన్వయ కమిటీల ద్వారా గ్రామాల్లో సాగులో లేని భూములను గుర్తించాలన్నారు. వర్మీకంపోస్టును రైతులంతా వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

జగ్గంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): జెడ్‌రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు జరగనుంది. నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని జగ్గంపేట ఎంపీడీవో కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యం రోడ్లకు అనుమతులు ఇప్పించండి

పంచాయతీరాజ్ కమిషనర్, అటవీ శాఖ ఓఎస్డీలకు ఎమ్మెల్యే శిరీష వినతులు



పంచాయతీరాజ్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, మే 5(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మన్యంలోని అనేక రహదారుల నిర్మాణాలకు అవసరమైన అటవీ అనుమతులు మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, అటవీ శాఖ ఓఎస్డీలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. మన్యంలో అనేక రహదారులకు అటవీ అనుమతులు మంజూరు చేయకపోవడంతో మారుమూల ప్రాంతాల గిరిజనులు పడుతున్న ఇబ్బందులను ఆమె వివరించారు. మారేడుమిల్లి, రంపచోడవరంలో నిర్వహిస్తున్న చెక్‌పోస్టుల అంశంపై కూడా ఎమ్మెల్యే శిరీషదేవి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె వెంట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ ఉన్నారు.

రేణుకా యల్లమ్మ ఆలయంలో సుమంగళి పూజలు



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల, మే 5(ఆంధ్రజ్యోతి): వేటమామిడి ఊడలమర్రి రేణుకా యల్లమ్మ జాతరలో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో మాతృమూర్తులతో నవదుర్గా సుమంగళి పూజ, 108 సుమంగళీ స్త్రీలకు వాయినాల ప్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నవదుర్గా కాళీ నృత్యాలు, గరగల సంబరం, కేరళ సంప్రదాయ కేళి వాయిద్యాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. రేణుకా యల్లమ్మ, దక్షిణ కాళీ, చిన్న మస్తా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. జాతర అనంతరం చిన్నమస్తా, రేణుకా యల్లమ్మ మహా కుంభ బలిపూజ నిర్వహించారు.

మావోయిస్టులకు సహకరించొద్దు: సీఐ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్

మోతుగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మెట్టగూడెం గ్రామాన్ని సీఐ తెల్లం దుర్గాప్రసాద్ సోమవారం సందర్శించారు. అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏవోబీ పరిసర ప్రాంతాల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు సమాచారం వస్తుందని, ఈనేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవ్వరూ వారికి సహకరించకూడదని, ఒక వేళ మావోయిస్టులు వచ్చినట్టు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అనంతరం గ్రామస్తులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట డొంకరాయి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ కె.కల్యాణ్, మొహిద్దీన్, కానిస్టేబుల్ పోశయ్య ఉన్నారు.

గంగాలమ్మ పండుగలకు శ్రీకారం



అమ్మవారి ఘటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

వై.రామవరం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామదేవత గంగాలమ్మ అమ్మవార్ల పండుగలకు గిరిజనులు శ్రీకారం చుట్టారు. మండలంలో తొలుత పైడిపుట్ట గ్రామం నుంచి అమ్మవారి ఘటం ఊరేగింపుతో పండుగలను ప్రారంభించారు. సోమవారం వై.రామవరం వారపు సంతలో ఊరేగించగా పలువురు భక్తులు పూజలు నిర్వహించారు.

రేషన్ బియ్యం అమ్మితే క్రిమినల్ కేసులు

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, మే 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో రేషన్ బియ్యం విక్రయించినా, కొనుగోలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇంటి వద్దే సరఫరా చేస్తున్నామన్నారు. కొంత మంది తెల్లరేషన్ కార్డులను ఇతరులకు తనాఖా పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై రేషన్ బియ్యం విక్రయిస్తే వారి రేషన్‌కార్డులను తొలగిస్తామని చెప్పారు.

తడిసిన పంటలు



ఇందుకూరులో తడిసిన మొక్కజొన్న పంటను ఆరబోసిన దృశ్యం

దేవీపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షాల కారణంగా ఆదివారం పోతవరం, దేవారం, శరభవరం, ఇందుకూరుపేట, ఇందుకూరు, ఫజుల్లాబాద్, కొత్తవీధి, ముసినిగుంట, కమలంపాలెం తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి తదితర పంటలు తడిసిముద్దయ్యాయి. నాలుగు నెలలు రైతులు శ్రమించి కష్టపడి వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి చేతికి వచ్చే సమయానికి పండించిన పంట వర్షానికి తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తడవడంతో గిట్టుబాటు ధర తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులకు కూడా వర్షం తీరని నష్టం చేకూర్చింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

తోటకూరపాలెంలో రెవెన్యూ గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాల్

వై.రామవరం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో చవిటిదిబ్బలు పంచాయతీ తోటకూరపాలెంలో సోమవారం తహశీల్దార్ వేణుగోపాల్ గ్రామ సభ నిర్వహించారు. రీసర్వే 13 నోటిఫికేషన్, పట్టా ముద్రణ తదితర అంశాలపై లబ్ధిదారుల నుంచి అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఆయా అంశాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో, వీఆర్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏమీ హాయిలే భళా



మోతుగూడెం, మే 5(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో దబ్బగూడెంలో సోమవారం ఎండ తాపానికి తట్టుకోలేక ఉపశమనం కోసం వృద్ధులు, పిల్లలు మామిడి చెట్టు నీడలో సేదతీరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం



అన్నక్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేట మండలం మర్రిపాకకు చెందిన సూర్యారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు, టీడీపీ నాయకుడైన నూకాపతి రావు ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, మంగ రౌతు రామకృష్ణ, రేఖబుల్లి రాజు, డేగల సత్తిబాబు, కాపవరపు ప్రకాశరావు, పైలా శివరామకృష్ణ, రెడ్డి ఆంజనేయులు, దుళ్ళ అనిల్, కాపవరపు అప్పారావు , తదితరులు పాల్గొన్నారు.

వరి పంట విషయంలో జాగ్రత్తలు పాటించాలి

శంఖవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిన వరి పంట విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి. గాంధీ అన్నారు. శంఖవరం గ్రామంలో తడిచిన వరి పనలను ఆయన సోమ వారం పరిశీలించారు. తడిచిన పనలు మొలకెత్తకుండా రంగు మారకుండా ఉండడానికి వరి కంకులపై ఐదు కిలోలు ఉప్పును వంద మిల్లీమీటర్ల నీటిలో కరిగించిన ద్రవకాన్ని చల్లాలన్నారు. ఎకరా వరి పంటకు నలభై నుంచి యాభై కిలోలు ఉప్పు సరిపోతుందన్నారు. ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఏఈవో శ్రీనివాస్, వికాస్ తదితరులు ఉన్నారు.

గొల్లు ఎంపికపై హర్షం

రౌతులపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధిగా ఎస్.పైడిపాలకి చెందిన గొల్లు వెంకట రమణ నియమితులయ్యారు. ఆయన నియామకంపై జడ్పీటీసీ గొల్లు చినదివాణం, జిగిరెడ్డి సత్తిబాబు, సర్పం శ్రీను, వాసిరెడ్డి జమీలు, రాయిప్రసాద్, సత్యనారాయణ, వాసిరెడ్డి బాస్కరబాబు హర్షం వ్యక్తం చేశారు.

రాచపల్లిలో వైభవంగా గంగాలమ్మ గావు సంబరం

ప్రత్తిపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామంలో గంగాలమ్మ తల్లి గావు సంబరం సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించి తప్పిడిగుళ్ళ, డప్పుల డ్యాన్సులు, బాణాసంచాల మధ్య ఊరేగించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి సారెలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఒమ్మి గంగరాజు, చక్రం, పెద్దబ్బాయి, సత్తిబాబు కుటుంబీకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు వైసీపీ నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు విచ్చేసి అమ్మవారికి పూజలు నిర్వహించి ఉత్సవాల నిర్వహణకు రూ.5 వేలు సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మిగంగరాజు, ఒమ్మి నూకరాజు, బాబ్జి, రమణ, రాజు, నాగు పాల్గొన్నారు.

'ప్రతి స్కీం వెనుక స్కాం'

తుని రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ప్రతి స్కీం వెనకాల ఒకస్కాం ఉంటుందని వైసీపీ నేత యనమల కృష్ణుడు ఆరోపించారు. స్కాం ఉంటేనే చంద్రబాబు స్కీమ్ ప్రవేశపెడతారనేది అందరికీ తెలిసిన విషయం అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నివాసంలో వైసీపీ బీసీ నేతలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడా రు. యనమల మాట్లాడుతూ బీసీమహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఇస్తామని చెప్పి రూ.167 కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. సమావేశంలో గొర్లి రామచంద్రరావు, లాలం బాబ్జీ, పెండ్యాల రామకృష్ణ, బెక్కం చంద్రగిరి, లగుడు శ్రీనివాస్, బత్తుల వీరబాబు, దుంగల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంగ్లంపై తరగతులు

ఏలేశ్వరం, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆంగ్లంపై తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు శిడగం సత్యనారాయణ, రాములు హిందీ, ఆంగ్లం, చిత్రలేఖనం, కథలు, తదితర అంశాలను వివరించారు.

ఎమ్మెల్యేకు సోమలమ్మ జాతర ఆహ్వానపత్రిక



ఎమ్మెల్యే నెహ్రూకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

జగ్గంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమాలమ్మనగర్‌లో వేంచేసి ఉన్న సోమాలమ్మతల్లి సప్తమ (7వ) వార్షికోత్సవ జాతరకు రావాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆలయ కమిటీ సభ్యులు, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్రచౌదరి, ముమ్మిడివరపు లలితబాబు ఆహ్వానపత్రిక అందజేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), టీడీపీ జగ్గంపేట పట్టణాధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, అన్నవరం రిటైర్డ్ పీఆర్వో తులా రామ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఏపీటీఎఫ్ ధర్నా



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

ప్రత్తిపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆ సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకత్వం వచ్చిన ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లబిల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గోర్స దుర్గాప్రసాద్, జిల్లా మాజీ అధ్యక్షుడు కేఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1నుంచి 5వ తరగతి మోడల్ ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా 2 ఎస్జీటీలు ఉండేలా చూడాలని.. 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలని... 6,7,8 తరగతులు ఉన్నచోట్ల 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొనసాగించాలన్నారు. తెలుగు, ఆంగ్ల మీడియం కొనసాగించాలని, 12వ పీఆర్సీ కమిటీ నియమించాలని, ఐఆర్ వెంటనే ప్రకటించి పెండింగ్‌లో ఉన్న 3డీఏలు విడుదల చేయాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ సూర్యప్రభకు అందజేశారు. ఆందోళనలో ఏపీటీఎఫ్ ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండల నాయకులు వెన్నా శ్రీనివాస్, శ్రీరాం, బి.సత్యప్రసాద్, సి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘ నేతలు

తుని రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ అనుబంధ సంస్థ తుని శాఖ ఆర్టీసీ కార్మికులు తుని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కి లీవులు ఇవ్వాలని, కొత్త బస్సులు కొనుగోలు గ్యారేజ్ మెకానికల్‌పై పనిభారం, డ్రైవర్ల నైట్ అవుట్, అలవెన్సులు వంటి పలు సమస్యలపై వినతి సమర్పించారు. కార్యక్రమంలో తుని డిపో కార్యదర్శి సాయిరాం, చైర్మన్‌డీఎన్ఎస్ బాబా, గ్యారేజ్ కార్యదర్శి చంద్రశేఖర్, పీడీ కుమార్, జీవీ బాబు, సీహెచ్‌వీ ప్రసాద్, అమీర్, అప్పారావు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు

జగ్గంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, దళారీ వ్యవస్థను అరికట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో రైతులతో రాస్తారోకో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఇంతలో అటుగా వెళ్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కాట్రావులపల్లి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులతో చర్చలు జరిపి రైతు సమస్యలను పరిష్కరిస్తామని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనేలా చర్యలు తీసుకుంటామని ఆందోళన విరమించాలని కోరారు. ఎమ్మెల్యే హామీ మేరకు రైతులు ఆందోళన విరమించారు.

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): తత్వవేత్త, శ్రామిక ప్రజల మార్గదర్శి సమ సమాజ నిర్మాణ సిద్ధాంతకర్త కార్ల్‌మార్క్స్ జయంతిని జగ్గంపేట మండలం రామవరంశివారు రంగవల్లి నగర్‌లో సోమవారం నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ (వి), పీవోడబ్ల్యూ (స్త్రీవిముక్తి) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ సిద్ధాంతమే ప్రపంచ మానవాళికి మార్గదర్శి అని అన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ (వి) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, ఏపీఆర్‌సీఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, జాను, సెబాస్టియన్, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలపై ప్రచారం



యర్రవరంలో కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని కల్యాణోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ సోమవారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు నేతృత్వంలో పెద్దనాపల్లి, యర్రవరం, తిరుమాలి జంక్షన్, ఏలేశ్వరం, తదితర గ్రామాల్లో కరపత్రాలు పంచి ఈనెల 7 నుంచి 13 వరకు జరిగే ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

ప్రత్తిపాడులో ఉచిత నేత్ర వైద్యశిబిరం



ప్రత్తిపాడులో నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సెయింటనరీ బాప్టిస్ట్ చర్చిలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ప్రత్తిపాడు సత్య ఐ కేర్ కంటి వైద్యుడు అగర్వాల్ కంటి రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. చర్చి కార్యవర్గ సభ్యులు, పెద్దలు అనంతరం రోగులు కళ్ళజోళ్లు పంపిణీ ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, మాజీ అధ్యక్షుడు ఎన్.సంజీవరావుపాల్గొన్నారు.

'ఆదిత్య'లో రక్తదాన శిబిరం



రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, మే5 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూని వర్సిటీలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించగా డిప్యూటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. 318 యూనిట్ల బ్లడ్ ప్యాకెట్లను సేకరించారు. కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, రెడ్‌క్రాస్ యూనిట్ కోఆర్డినేటర్ పి.శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాంబాబు, లియోక్లబ్ కోఆర్డినేటర్ ఎన్.నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మజ్జిగ వితరణ



ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఏలేశ్వరం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుత్రిలో సోమవారం టీడీపీ శ్రేణులు మజ్జిగ వితరణ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వివేకానంద సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు నేతృత్వంలో రోగులకు మజ్జిగ అందజేశారు. దాతల సాయంతో రోజూ ఆసుపత్రి ఆవరణలో చలివేంద్రంతో పాటు మజ్జిగ పంపిణీ చేపడతామన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, వాగు రాజేష్, బుగతా శ్రీనివాస్, సామంతుల గోపి, మైరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గజ్జనపూడిలో కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రత్తిపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జనపూడి హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశం అయ్యారు. 16 ఏళ్ల క్రితం ఈ హైస్కూల్లో 2008-09 పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళ నంగా కలిసి ఆ నాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆ నాటి ఉపాధ్యాయులు వి.వీర రాఘవరెడ్డి, లోవరాజు, రాంజీప్రసాద్, శ్రీనివాసరావును సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పదో తరగతి పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు ఉలుసు శ్రీను, గెడ్డం నాగేశ్వరరావు, సత్య, గౌరీ పార్వతి, బర్ల వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేయాలి

• మాజీమంత్రి యనమల రామకృష్ణుడు



తేటగుంటలో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని మాజీమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంటలో సోమవారం టీడీపీ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. కుటుంబ సాధికార సారథుల నియామక ప్రక్రియలో సకాలంలో పూర్తి చేసిన పార్టీ నేతలను యనమల అభినందించారు. ఇదే స్ఫూర్తితో పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతనూ విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ గ్రామ, మండల స్థాయి కమిటీలు, ఇతరత్ర విషయాలపై ఈనెల 8న ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలేశ్వరం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిప్యూటీ తహశీల్దార్ కుశరాజుకు వినతి పత్రం అందజేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రాష్ట్రకమిటీ 58 డిమాండ్లలో ఉద్యోగ భద్రత 1/2019 సర్క్యులర్‌ను అమాలుచేయాలని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.త్రిమూర్తులు, కామేశ్వరరావు, ప్రవీణ్, శ్రీనువాసరావు, రాజు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.